### కోరుట్ల ప్రజా ఆశీర్వాదసభ సైడ్‌లైట్స్

- కోరుట్ల పట్టణ శివారులోని పెద్దగుండు వద్ద ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది.
- మధ్యాహ్నం 12 గంటల నుంచే జనం తండోపతండాలుగా ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చారు.
- మండుటెండలో సైతం సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు ఉత్కంఠంగా ఎదురుచూశారు.
- వేదిక ప్రాంగణం పూర్తిగా నిండిపోవడంతో ప్రజలు చెట్ల కింద కూర్చొని మరీ సీఎం ప్రసంగాన్ని విన్నారు.
- సీఎం కేసీఆర్ నిర్దేశిత సమయాని కంటే ఇరవై ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు.
- సీఎం కేసీఆర్ సభావేదికపైకి రాగానే రెండు మార్లు వేదికను చుడుతూ, ప్రజలకు అభివాదం చేశారు. అలాగే వేదికపై ఆసీనులైన వారందరికి నమస్కారం చేశారు.
- ముందుగా కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కొద్దిసేపు ప్రసంగించారు...
- సంజయ్ తన ప్రసంగంలో తన తండ్రిలాంటి సీఎం కేసీఆర్ తనపై చాల పెద్ద బాధ్యతను అప్పగించారని ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పడంతో ప్రజలు చప్పట్లు కొట్టారు.
- సాయంత్రం 4:51 నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించారు.
- తన ప్రసంగంలో అభ్యర్థి సంజయ్‌ను తన కొడుకుతో సమానమని సీఎం కేసీఆర్ అభివర్ణించడంతో పాటు. ఉద్యమ సమయంలో తన అరోగ్య పరిస్థితులు, ప్రాణ రక్షణ కోసం వైద్యుడిగా నిమిష, నిమిసం దగ్గరే ఉండి తనను కాపాడుకున్నారని సీఎం కేసీఆర్ చెప్పడంతో సభలో హర్షాతీరేఖలు వ్యక్తం అయ్యాయి.
- కోట్ల రూపాయలు సంపాదించుకునే అవకాశం, పేరు తెచ్చుకునే మార్గం ఉన్నప్పటికి, పుట్టిన గడ్డ కోసం డాక్టర్ సంజయ్ ప్రజాసేవకు వస్తున్నాడని, ఆయనను ఆశీర్వదించాలన్నారు. .
- సభలో మైనార్టీలను ఉద్దేశించి హిందీలో ప్రసంగించిన సీఎం మైనార్టీల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడలేని విధంగా రూ. 12 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.
- కాంగ్రెస్ పార్టీ మాటలు వింటే మునుగుడేనని, తియ్యటి మాటలకు తిమ్మక్క తీర్థం పోతే...నువ్వు గుల్లె...నేను సల్లె అన్నట్లుగా అయితదని సీఎం కేసీఆర్ గ్రామీణ భాషలో సామెత రూపంలో చెప్పడంతో ప్రజలు గొల్లుమని నవ్వారు.
- ధరణి పోర్టల్‌ను బంగాళఖాతంలో వేద్దామన్న కాంగ్రెస్ పార్టీనే బంగాళఖాతంలో వేయాలని సీఎం కేసీఆర్ అన్నప్పుడు సైతం ప్రజలు స్పందించారు.
- కాకతీయ కాలువపై మోటర్లు పెడితే అడిగే కొడుకు ఉన్నాడా అంటూ సీఎం కేసీఆర్ పల్లెటూరి యాసలో మాట్లాడటం సైతం అందరిని అలరించింది.
- సభ వేదిక వద్ద ప్రఖ్యాత ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, ఆటా పాటలతో దాదాపు రెండున్నర గంటల పాటు సభికులను సమ్మోహితులను చేశారు..
- గులాబీల జెండలే రామక్క.. దోస్తర దిన్ అందమా.. దోస్తికట్టుకుందమా...అంటూ సోమన్న పాడిన పాటలు, వేదికపై వేసిన స్టెప్పులు ప్రజలను ఊర్రూతలూగించాయి.
- సభకు దాదాపు లక్ష మంది హజరు కావడంతో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు జనసంద్రాన్ని తలపించాయి.
- మెట్‌పల్లి వైపు ఆరపేట నుండి, జగిత్యాల మార్గంలో మోహన్‌రావుపేట వరకు వాహనాలు నిలిచిపోయాయి.
- సీఎం కేసీఆర్ సభకు లక్షలాది మంది తరలిరావడం కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. 750 ఆర్టీసీ బస్సులు, 200 ప్రైవేట్ బస్సులు, 100 స్కూల్ బస్సులతో పాటు, హైర్‌బస్సులు, ఆటోలు, డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్లను వినియోగించారు.
- సభ స్థలికి సమీపంలోనే దాదాపు 20 ఎకరాల విశాలస్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ప్రధాన పార్కింగ్‌తో పాటు, సభకు నాలుగు వైపుల సైతం పార్కింగ్ ఏరియాలను ఏర్పాటు చేశారు.
- అదనపు డీజీపీ ఆధ్వర్యంలో పకడ్బంధీ పోలీసు బంధోబస్తు నిర్వహించారు.
- కోరుట్లలో హెలిపాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్చం అందించి వీరతిలకం దిద్దిన జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత

**- కోరుట్ల, కోరుట్ల రూరల్, కథలాపూర్ నవంబర్ 3**



సభకు వస్తున్న మహిళలు





సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల

# సీఎం సభకు తరలిన జనం

కోరుట్ల రూరల్, నవంబర్ 3: మండలంలో నుంచి సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు జనం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గ ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 3: కోరుట్ల పట్టణ శివారులో శుక్రవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మెట్‌పల్లి మండలం నుంచి ప్రజలకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గ్రామాల నుంచి ప్రత్యేక ఏర్పాటు చేసిన బస్సులు, వాహనాల్లో మహిళలు, వృద్ధులు, యువకులు భారీగా వెళ్లారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, ఎంపీపీ మారు సాయిరెడ్డి సమన్వయంతో ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచులు నాయకులు జన సమీకరణ చేపట్టారు. ఫలితంగా మండలం నుంచి 13 వేల మంది సీఎం సభకు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.

మల్లాపూర్, నవంబర్ 3: కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభకు మల్లాపూర్ మండలం నుంచి సుమారు పదివేల మంది జనం తరలివెళ్లినట్లు పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా 23 గ్రామాలకు 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, ఆర్బీఎస్ జిల్లా డైరెక్టర్ దేవ మల్లయ్య, మండలాధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మైదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏనుగు రామిరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

మారుతీనగర్, నవంబర్ 3: కోరుట్ల పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు పశువైద్య కళాశాల సమీపంలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు మెట్‌పల్లి పట్టణంలోని ఆయా వార్డుల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు భారీ సంఖ్యలో శుక్రవారం తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం



మైనార్టీ నేతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్



జోగిన్‌పల్లి నుంచి సీఎం సభకు తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు,ప్రజలు



మెట్‌పల్లి రూరల్ : సీఎం సభకు రామలచ్చక్కపేట నుంచి తరలివెళ్తున్న నాయకులు, ప్రజలు



మల్లాపూర్: ప్రత్యేక బస్సు వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మారుతీనగర్: సభకు బస్సులో వెళ్తున్న మహిళలు